

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

యువతరం ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని కేరళ వెటర్నరీ వర్సిటీ వీసీ శశీంద్రనాథ్ పిలుపునిచ్చారు. - Iలో



డప్పు కొట్టి చెబుతున్నా!

వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతరకు ఘన చరిత్ర ఉంది. ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై హర్షం వ్యక్తమవుతోంది. - IIలో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	33	27
చిత్తూరు	33	26
తిరుమల	29	22
గూడూరు	34	27
నగరి	34	27

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. టైంస్లాట్ టిక్కెట్లు ఉంటే సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పుస్తకమస్తు!

ఆకర్షణీయ చిత్రాలు.. కార్టూన్లు.. నాణ్యమైన పేపర్.. రంగు రంగుల ఆయిల్ ప్రింటింగ్‌తో ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను ముద్రించింది. బడి గంట కొట్టిన రోజే పిల్లలకు పంపిణీ చేసింది. విద్యాసంస్కరణల్లో భాగంగా సెమిస్టర్ల వారీగా సబ్జెక్టులకు అనుగుణంగా బుక్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలో సెమిస్టర్–2 పుస్తకాలను సైతం పకడ్బందీగా విద్యార్థులకు అందజేసింది.

- ఉమ్మడి జిల్లా పరిధిలో పక్కాగా సెమిస్టర్–2 బుక్స్ పంపిణీ
- సర్కారు బడుల్లోని విద్యార్థులందరికీ అందేలా చర్యలు
- ప్రక్రియను పర్యవేక్షించిన ఉన్నతాధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



తిరుపతి మండలం దుర్గసముద్రం జెడ్పీ హైస్కూల్‌లో పుస్తకాలు చూపుతున్న విద్యార్థులు



చౌడేపల్లి మండలం ఏ.కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌లో సెమిస్టర్- 2 పుస్తకాలతో విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం విద్యారంగంలో పలు సంస్కరణలు ప్రవేశపెట్టింది. అందులో భాగంగా నూతన పాఠ్యపుస్తకాలను కొత్త హంగులతో సిద్ధం చేసింది. విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు పుస్తకాల బరువు తగ్గించేందుకు సెమిస్టర్ల వారీగా పుస్తకాలను తీర్చిదిద్దింది. ప్రస్తుతం విద్యార్థులకు రెండు సెమిస్టర్లను అందించింది. 1 నుంచి 10వ తరగతులకు లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ కలిపి 113 టైటిల్స్ ముద్రించింది. ఈ మేరకు శనివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పకడ్బందీగా రెండో సెమిస్టర్ పుస్తకాలను 6 నుంచి 9 వ తరగతి విద్యార్థులకు అందజేసినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 6,65,467 పాఠ్యపుస్తకాలు, 2,44,870 వర్క్‌బుక్స్ మొత్తం 9,10,337 సెమిస్టర్ 2 పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు వివరించారు. మొత్తం ప్రక్రియను చిత్తూరు కలెక్టర్ షణ్మోహన్, తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, చిత్తూరు డీఈఓ విజయేంద్రరావు, తిరుపతి డీఈఓ శేఖర్ పర్యవేక్షించారు. సకాలంలో పుస్తకాలు అందించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివరణలతో వీడియోలు

విద్యార్థులకు అందించిన సబ్జెక్టు పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన వీడియో వివరణలను అందుబాటులో ఉంచారు. పుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్స్ ద్వారా స్కాన్ చేసిన వెంటనే సంబంధిత విషయానికి సంబంధించిన అదనపు సమాచారంతో కూడిన వీడియోలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టారు.

పకడ్బందీగా పంపిణీ



పకడ్బందీగా సెమిస్టర్–2 పుస్తకాలను పంపిణీ చేశాం. సర్కారు బడుల్లోని ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకం అందేలా చర్యలు చేపట్టాం. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓలను ఆదేశించాం. గతంలో మాదిరి కాకుండా సకాలంలో పుస్తకాలను అందిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి. చక్కగా చదువుకుని ఉన్నతంగా రాణించాలి. – వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి

శ్రీసిటీ సందర్శన



ప్రిన్సిపల్ సెక్రటరీ సునీతకు స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి

సత్యవేడు: చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత శనివారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి ఆమెకు సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక నగరం ప్రగతిని వివరించారు. ఆమె ఎంతో ఆసక్తితో శ్రీసిటీలోని వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా టోరేఇండస్ట్రీస్(ఇండియా)ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ సహాయం, సహకారంపై సంతృప్తి చెందుతున్నారా అంటూ కంపెనీ యాజమాన్యాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రశ్నించగా.. వారు సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆమె శ్రీసిటీలోని పలు పరిశ్రమల సీఈఓలతో సమావేశమయ్యారు.

సర్వే పనులు వేగవంతం



మాట్లాడుతున్న జేసీ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: భూముల రీసర్వే పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి సర్వే జిల్లా అధికారి జయరాజ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని సర్వేయర్లకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ తప్పులు లేకుండా సరిహద్దులు స్పష్టంగా ఉండేలా సర్వే రాళ్ల ఏర్పాటు చేయాలని సూచించారు.


పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి విజిలెన్స్ బృందం

పిచ్చాటూరు: పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. మధ్యాహ్నం విజయ్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్, రామకృష్ణ నాయక్‌తో కూడిన విజిలెన్స్ బృందం పీహెచ్‌సీకి చేరుకొని రికార్డులను పరిశీలించింది. అలాగే నీటి ట్యాంకును శుభ్రంగా ఉంచుకోవాలని, కాలం చెల్లిన మందులను ఎప్పటికప్పుడు పడేయాల ని వైద్యాధికారి డాక్టర్ గాయత్రికి సూచించింది.

10లోపు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి



భాస్కర్‌రెడ్డి

తిరుపతి అర్బన్: బీసీ, ఈబీసీ, సంచారజాతులకు చెందిన విద్యార్థులు ఉపకారవేతనాల కోసం ఆగస్టు 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ పీఎం యశస్వి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. 9, 10, ఇంటర్ చదువుతున్న వారు అర్హులుగా పేర్కొన్నారు. అయితే వార్షిక ఆదాయం రూ.2.50లక్షల లోపు ఉండాలని స్పష్టం చేశారు. అర్హులైన వారు హెచ్‌టీటీపీఎస్.యట్.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు సెప్టెంబర్ 29వ తేదిన ప్రవేశ పరీక్ష నిర్వహించి మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారని వివరించారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.75వేలు, ఇంటర్ విద్యార్థులకు ఏడాదికి రూ.1.25లక్షలు విడుదల చేస్తారని వివరించారు. దరఖాస్తు సమయంలో ఫోన్ నంబర్‌తోపాటు ఆధార్‌కార్డు,బ్యాంక్ పాస్ పుస్తకం, ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలని వివరించారు.

పాపవినాశనం రోడ్డులో కారు-జీపు ఢీ

తిరుమల : తిరుమల పాపవినాశనం రోడ్డులో కారు, జీపు ఢీకొన్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తెలంగాణకు చెందిన భక్తులు కారులో తిరుమలకు చేరుకున్నారు. అక్కడి నుంచి పాపవినాశనం చేరుకుని తిరిగి తిరుమలకు వస్తున్నారు. ఈ క్రమంలో తిరుమల నుంచి పాప వినాశనం వెళుతున్న మహారాష్ట్రకు చెందిన జీపు మలుపువద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో భక్తులు స్వల్పగాయాలతో భయటపడ్డారు.

గవర్నర్‌కు స్వాగతం, వీడ్కోలు

రేణిగుంట: తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవంలో కులపతి హోదాలో పాల్గొనేందుకు శనివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు అధికారులు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయంలో ఆయనకు కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ పద్మనాభరెడ్డి, లైజాన్ ఆఫీసర్ భాస్కర్‌నాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయల్దేరి వెళ్లారు.

సాదర వీడ్కోలు

స్నాతకోత్సవం అనంతరం గవర్నర్ మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఇతర అధికారులు వీడ్కోలు పలికారు.


రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి

అమ్మవారి సేవలో అడిషనల్ డీజీపీ


అమ్మవారి ఆలయంలో అడిషనల్ డీజీపీ రవిశంకర్‌అయ్యర్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర అడిషనల్ డీజీపీ రవిశంకర్ అయ్యర్ శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుకుని అమ్మవారి సహస్రనామార్చన సేవలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏవీఎస్‌ఓ శైలేంద్రబాబు, ఎస్‌ఐ జగన్నాథంరెడ్డి పాల్గొన్నారు.

దత్తపుత్రుడికి నీతులు మీరే చెప్పాలి


పాలచ్చూరులో సంక్షేమ ఫలాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

పెళ్లకూరు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక చంద్రబాబు డైరెక్షన్‌లో బూతులు మాట్లాడుతున్న దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌కు వచ్చే ఎన్నికల్లో మీరే నీతులు చెప్పి సరైన నిర్ణయం తీసుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం పాలచ్చూరు, జంగాలపల్లి, దిరసనమాల, కప్పగుంటకండ్రిగ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ బుక్‌లెట్లు అందజేశారు. పేదరికం పోయి అభివృద్ధి సాధించుకోవడం కోసం మరోమారు జగన్ సర్కార్‌ను ఆశీర్వదించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కు సరైన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం పాలచ్చూరు గ్రామంలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెళ్లూరు షర్మిళ, ఎంపీపీ పీ.శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్ ప్రిస్కిల్లా, మాజీ డీసీసీబీ డైరెక్టర్ యం.సోమశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్లు యం.సుధాకర్, కే.రఘునాయుడు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,300
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,505
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,500
రిటైల్ వెండి గ్రాము	రూ.78.50

ఘనంగా ముగిసిన ఆండాళ్ తిరువడిపురం ఉత్సవం


ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు 10 రోజులు అత్యంత వేడుకగా చేపట్టిన ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం శనివారం ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా చివరి రోజైన శనివారం ఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు గోవిందరాజస్వామి, ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం గోవిందరాజస్వామి, ఆండాళ్ అమ్మవారిని ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కర్పూర నీరాజనాల పలికారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

ఏర్పేడు: రైలులో ప్రయాణిస్తు కాలుజారి కిందపడి వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని కొత్తకండ్రిగ వద్ద శనివారం చోటుచేసుకుంది. రేణిగుంట రైల్వే ఎస్‌ఐ రవి కథనం మేరకు, తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వెళుతున్న రైలులో గుర్తు తెలియని వ్యక్తి (26) ప్రయాణిస్తూ కాలుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి జేబులోని స్టేట్‌బ్యాంకు ఏటీఎంపై పేరు ప్రమోద్‌గా ఉన్నట్లు చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.


ప్రమోద్ మృతదేహం

క్లుప్తంగా

23న ముగియనున్న సభాపర్వం

తిరుమల: తిరుమల నాద నీరాంజనం వేదికపై జరుగుతున్న మహాభారతంలోని సభాపర్వ పారాయణం (సభాపర్వం–ధర్మసారం) ఆదివారం ముగియనుంది. 81 అధ్యాయాలు, 10 ఉప పర్వాలు, 3700 శ్లోకాలతో కూడిన సభాపర్వం శ్రీకృష్ణుని మహిమలతోపాటు సమాజానికి ధార్మిక సందేశాన్ని అందిస్తుంది. 2022 జూన్ 1న సభాపర్వ పారాయణం ప్రారంభమైంది. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం పండితులు వేంకటాచలపతి ప్రతి శ్లోకానికీ అర్థాన్ని వివరించగా, రాఘవేంద్ర శ్లోక పారాయణం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రతిరోజూ రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది.

గాయపడిన బాలుడి మృతి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం అగరాల సమీపంలో గురువారం రాత్రి కారు ఢీకొనడంతో గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పాకాల మండలం మద్దినాయనపల్లెకు చెందిన భానుప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంలో తిరుపతి బయలుదేరాడు. అగరాల సమీపంలో వాటర్ బాటిల్ కోసం వాహనాన్ని పక్కన నిలిపి దుకాణం వద్దకు వెళ్తుండగా చిత్తూరు నుంచి తిరుపతికి వెళుతున్న కారు ఢీకొంది. దీంతో భానుప్రసాద్, అతని మూడు నెలల కుమారుడు తనుష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహన సిబ్బంది తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చిన్నారి తనుష్ మృతి చెందాడు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం ఏపీ చీఫ్ విప్ ప్రసాద్ రాజు, తెలంగాణ ఎమ్మెల్యే కే.చందర్ పటేల్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

తప్పల్లేకుండా ఓటరు జాబితా

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తిరుపతి ఆర్డీవో కనక నరసారెడ్డి ఆదేశించారు. ఆయన శనివారం చంద్రగిరి మండలం తొండవాడ, శానంబట్లలో ఇంటింటి ఓటర్ల సర్వేను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా ఓటర్ల సర్వే చేపట్టాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. మృతిచెందిన, వలస వెళ్లిన, ఇతర దేశాల్లో ఉండే వారి ఓట్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో డీటీ మోహన్ రెడ్డి, వీఆర్వో మునస్వామి పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో చాన్సలర్ హోదాలో ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ వేదికపై



విద్యార్థికి పట్టా అందిస్తున్న గవర్నర్

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

- ఆర్బీకేల సేవలు ప్రశంసనీయం
- ఘనంగా ఎస్వీ వెటర్నరీ 12వ స్నాతకోత్సవం
- పతకాలు, డిగ్రీ పట్టాలు అందజేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుపతి ఎడ్యుకేషన్ : యువతరం ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని కేరళ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎంఆర్.శశీంద్రనాథ్ పిలుపునిచ్చారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం (ఎస్వీ వెటర్నిటీ వర్సిటీ) 12వ స్నాతకోత్సవాన్ని శనివారం ఘనంగా జరిగింది. ఈ స్నాతకోత్సవానికి చాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవ్వగా.. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ ఎంఆర్.శశీంద్రనాథ్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలన్నారు. దీనికోసం ప్రభుత్వం విద్యావిధానాల స్టార్టప్‌లపై దృష్టి సారిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా వెటర్నరీ విశ్వవిద్యాలయాలు వెటర్నరీ ఇంక్యుబేషన్ ఫౌండేషన్స్, యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రామ్ ద్వారా స్టార్టప్‌లను సులభతరం చేస్తున్నట్లు తెలిపారు. స్టార్టప్–ఇంక్యుబేటర్–అకడమిక్ త్రయం ప్రశంసనీయమైన పురోగతిని సాధించనుందన్నారు.

స్వల్పకాలంలోనే అత్యున్నత అభివృద్ధి

ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ 16 ఏళ్ల స్వల్ప వ్యవధిలోనే నాణ్యమైన విద్య, పరిశోధన, విస్తరణకు బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకుని రాష్ట్రానికి సేవలందించేందుకు 41 సంస్థలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు అందిస్తున్న విలువైన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. రాష్ట్రంలో 80 శాంత గ్రామీణ కుటుంబాలు మిశ్రమ వ్యవసాయాన్ని ఆచరిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 92.54 లక్షల కుటుంబాలు పశువులు, పశువుల సంబంధిత కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నాయని, అలాగే దాదాపు 23.63 లక్షల కుటుంబాలు నేరుగా పశువులపై ఆధారపడి జీవిస్తున్నట్లు వెల్లడించారు. పశువైద్య, డెయిరీ టెక్నాలజీ విద్యార్థులు పాడి రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వైస్ చాన్సరల్ డాక్టర్ వీ.పద్మనాభరెడ్డి

విద్యార్థులకు పట్టాల అందజేత

బ్యాచులర్ వెటర్నరీ సైన్స్‌లో 222 మంది, బీటెక్ (డెయిరీ టెక్నాలజీ)లో 37 మంది, పీజీలో 102 మంది, ఐదుగురికి పీహెచ్‌డీ పట్టాలను అందజేశారు. వీరిలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 35 బంగారు పతకాలు, రెండు రజతాలు, ఒక నగదు బహుమతిని గవర్నర్ చేతుల మీదుగా అందించారు. వీరితో పాటు ఉత్తమ అధ్యాపకుడు, ఉత్తమ శాస్త్రవేత్త, యువ శాస్త్రవేత్త అవార్డులను అందించారు. అలాగే ప్రొఫెసర్ ఆంజనేయ ప్రసాద్ జీవన సాఫల్య అవార్డును డాక్టర్ ఎస్‌కే.రంజన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ డాక్టర్ వీ.పద్మనాభరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అరుణాచలం రవి, డీఆర్ డాక్టర్ సర్జన్‌రావు, వెటర్నరీ, డెయిరీ డీన్‌లు డాక్టర్ కే.వీరబ్రహ్మయ్య, డాక్టర్ జె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో తల్లిదండ్రుల సెల్ఫీ



పట్టాలు పొందిన ఉత్సాహంలో విద్యార్థులు

జాయింట్ ప్రెస్ కాన్ఫరెన్స్

ఏర్పేడు: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో ఈ నెల 24న నెప్ 2020పై జాయింట్ కాన్ఫరెన్స్ జరుగుతుందని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ శనివారం రాత్రి తెలిపారు. జాతీయ విద్యావిధానం 2020 మూడో వార్షికోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 29న న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో నెప్ 2020 ఈవెంట్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో.. కేవీలు, ఎన్వీలతో జాయింట్ ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి ఐఐటీ తిరుపతి, ఐసర్ డైరెక్టర్లు, యూనివర్సిటీ డిప్యూటీ కమిషనర్, హైదరాబాద్ కేవీఎస్ హాజరుకానున్నట్లు వెల్లడించారు.

రేణిగుంటలో జడివాన



రైల్వే స్టేషన్ ప్రాంగణంలో వర్షపునీరు

రేణిగుంట: రేణిగుంటలో శనివారం సాయంత్రం ఎడతెరపి లేకుండా 2గంటల పాటు జోరు వాన కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా రైల్వేస్టేషన్ పరిసరాల్లో వాన నీరు నిలిచిపోవడంతో ప్రయాణీకులు రాక,పోకలకు అవస్థలు పడ్డారు. వారపు సంత కావడంతో సంతలోనూ ప్రజలు బురదలో ఇబ్బందిపడ్డారు. వర్షానికి కొంతసేపు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీని పరిరక్షించుకుందాం

రేణిగుంట: రేణిగుంట మండలం గాజులమండ్యం ఎస్వీ సహకార చక్కెర కర్మాగారాన్ని రైతులంతా సమిష్టిగా పోరాడి పూర్వ వైభవాన్ని తీసుకొద్దామని రైతులు ప్రతిన బూనారు. షుగర్ ఫ్యాక్టరీ ఆవరణంలో శనివారం చెరుకు రైతులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మూసివేసిన ఈ కర్మాగారాన్ని 2004లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తెరిపించారన్నారు. 2009లో మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం రాగానే మూసేశారన్నారు. కొందరు అధికారులు తప్పుడు నివేదికలు ఇవ్వడం వల్ల ఈ కర్మాగారం పునఃప్రారంభ నిర్ణయం ఆలస్యమవుతోందని తెలిపారు. ఐదు నియోజకవర్గాల పరిధిలోని రైతులు ఆయా ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకొచ్చి ముఖ్యమంత్రిని కలవాలని నిర్ణయించారు. నియోజకవర్గ రైతు సలహా మండలి అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కర్మాగారం రైతు నాయకులు పట్టాభిరెడ్డి, చెరకు రైతు సమాఖ్య ఆలిండియా సభ్యురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఆండాళ్ తిరువడిపురం శాత్తుమొర

తిరుమల: తిరుమలలో శనివారం శ్రీ ఆండాళ్ తిరువడిపురం శాత్తుమొర శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు పురుశైవారితోటకు వేంచేపు చేశారు. అక్కడ నివేదనల అనంతరం స్వామి, అమ్మవార్లు బయల్దేరి పొగడ చెట్టు వద్దకు రాగానే హారతి ఇచ్చారు. శేషహారతి, పుష్పమాల, శ్రీశఠారి పొగడ చెట్టుకు సమర్పించారు. శ్రీ శఠారికి అభిషేకం అనంతరం తిరిగి తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల గుండా ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. పురాణాల ప్రకారం పాండ్య దేశంలో పరమ విష్ణుభక్తుడైన శ్రీ విష్ణుచిత్తుడికి చెందిన తులసీ వనంలో ఆషాఢ శుక్ల చతుర్థి నాడు పూర్వ ఫల్గునీ నక్షత్రంలో భూదేవి అంశగా ఆండాళ్(గోదాదేవి) అమ్మవారు ఆవిర్భవించారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి

శ్రీకాళహస్తి: ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తిరుపతి డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి తెలిపారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో కేంద్ర వైద్యబృందం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శిస్తుందని, జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రజారోగ్య వైద్యసేవలపై అధ్యయనం చేస్తుందని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని పలు వార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో ఐదు విభాగాలు రద్దు

తిరుపతి తుడా: శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాలలో డిప్లొమా పారా మెడికల్ కోర్సుల్లో ఐదు విభాగాల కోర్సులను రద్దు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ తెలిపారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ అలైడ్ హెల్త్ సైన్స్ పారామెడికల్ శాఖ ఎస్వీ మెడికల్ కళాశాలకు కేటాయించిన డిప్లొమా కోర్సులను రద్దు చేశారని చెప్పారు. ఈ నెల 6వ తేదీన పలు డిప్లొమా పారామెడికల్ కోర్సులకు నోటిఫికేషన్ వెలువడిందన్నారు. డిప్లొమా ఇన్ రేడియో గ్రాఫిక్ అసిస్టెంట్, డిప్లొమా ఇన్ కార్డియాలజీ, డిప్లొమా ఇన్ పర్ఫ్యూషన్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ ఈసీజీ, డిప్లొమా ఇన్ అప్తాలిక్ అసిస్టెంట్ కోర్సులను కొన్ని అనివార్య కారణాలవల్ల రద్దయ్యాయని చెప్పారు. దరఖాస్తుదారుడు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసి ఉంటే సంబంధిత ఫీజు రూ.100ను తిరిగి చెల్లిస్తామన్నారు. ఇతర వివరాలకు 9440879943లో సంప్రదించాలని ఆయన కోరారు.


జాతర ఆహ్వానానికి వెళ్లి..



మృతుడు వెంకటేశ్వర్లు (ఫైల్)

సైదాపురం: ఊళ్లో జాతర పండుగ ఉండడంతో బంధువులకు చెప్పి తిరిగి ఇంటికి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం మండలంలోని తిప్పిరెడ్డిపల్లి రహదారి వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ చల్లా వాసు కథనం.. బాలాయపల్లి మండలం, కొత్తపాళెం గ్రామానికి చెందిన ద్వారగర్ల వెంకటేశ్వర్లు(33) శ్రీకాళహస్తి సమీపంలోని క్రషర్‌లో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో వచ్చే వారం కొత్తపాళెంలో జాతర జరుగుతుండడంతో తమ బంధువులకు జాతర ఆహ్వానం చెప్పేందుకు స్వగ్రామం నుంచి శనివారం ఉదయం బైక్‌లో బయలుదేరాడు. బంధువులకు జాతర సమాచారాన్ని చేరవేసి తిరుగు ప్రయాణంలో సైదాపురం–రాపూరు మార్గంలోని తిప్పిరెడ్డిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న రాపూరు డిపోకు చెందిన హయ్యర్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలంలో సుమారు 10 అడుగుల మేర బైక్‌ను బస్సు లాక్కెళ్లింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అన్నమయ్య గొప్ప సామాజిక సంస్కర్త



ప్రసంగిస్తున్న శ్వేతా మాజీ డైరెక్టర్ భూమన్, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

వరదయ్యపాళెం: ప్రముఖ కవి, తెలుగు పదకవితా పితామహుడు శ్రీతాళ్లపాక అన్నమాచార్యులు 15వ శతాబ్దంలో గొప్ప సామాజిక సంస్కర్త అని శ్వేతా మాజీ డైరెక్టర్ భూమన్ (సుబ్రహ్మణ్యంరెడ్డి) తెలిపారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం ఉదయం శ్రీసిటీలో అన్నమయ్య సామాజికత అనే అంశంపై భూమన్ ప్రసంగం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.

డప్పు కొట్టి చెబుతున్నా..!

రాజులేలిన గడ్డపై జరిగే జాతరకు రాష్ట్ర ప్రభుత్వం విశిష్ట స్థానం కల్పించింది. భక్తులు, స్థానికుల మనోభావాలకు అధిక ప్రాధాన్యమిచ్చింది. వెంకటగిరి రాజాల ఆకాంక్షను నెరవేర్చింది. పోలేరమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలకు మెండుగా ఉండాలని సంకల్పించింది. ఈమేరకు నేతన్న నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- రాష్ట్ర పండుగగా వెంకటగిరి పోలేరమ్మ జాతర
- వెంకటగిరీయుల ఆకాంక్షను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ప్రభుత్వ ఆధ్వర్యంలో మరింత శోభాయమానం కానున్న జాతర



పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతరకు శతాబ్దాల చరిత్ర ఉంది. ఏడాది కొకసారి జరిగే జాతరలో పోలేరమ్మను దర్శించుకుంటే కోర్కెలు తీరుతాయన్న నమ్మకం భక్తుల్లో బలంగా ఉంది. వెంకటగిరి సంస్థాన రాజులు ఏలుతున్న రోజులవి. 1917లో వెంకటగిరిలో కలరా మహమ్మారి వందలాది మందిని బలితీసుకుంది. ఈ క్రమంలో వెంకటగిరి సంస్థానాధీశులు శీతలయాగం నిర్వహించారు. వెంకటగిరి పొలిమేరలో గ్రామశిలలను ఏర్పాటు చేసి జాతర నిర్వహించారు. అప్పటి నుంచి వెంకటగిరి జాతర జరుగుతూనే వస్తోంది. వెంకటగిరి సంస్థానాధీశుల ఆధీనంలో జరుగుతున్న పోలేరమ్మజాతర 1992 నుంచి దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.



హారతి అందుకుంటున్న పోలేరమ్మతల్లి (ఫైల్)



జాతర చాటింపు(ఫైల్)

నెరవేరిన కల

వెంకటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగా నిర్వహించాలనే స్థానికుల కల నెరవేరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరిలో నేతన్ననేస్తం ఐదో విడత ప్రారంభోత్సవ కార్యక్రమంలో పోలేరమ్మ జాతరను వెంకటగిరీయుల ఆకాంక్ష మేరకు రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు జీవో విడుదల చేస్తామని ప్రటించారు.

అరుదైన వేదిక

వెంకటగిరి పోలేరమ్మజాతర నిమ్నవర్గాలతోపాటు జానపద కళారూపాల ప్రదర్శనకు అరుదైన వేదికగా నిలుస్తోంది. మతాలకు అతీతంగా వెంకటగిరీయులు నిర్వహించుకుంటారు. ఈ జాతరలో నిమ్న వర్గాలకు చెందిన వ్యక్తులు ముందుండి జాతరను నిర్వహిస్తారు. రాష్ట్రంలోనే ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ జాతరకు వెంకటగిరీయులే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. జాతరకు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటే ఆ ఏడాది అంతా పోలేరమ్మ తల్లి ఆశీస్సులు ఉంటాయని భక్తుల విశ్వాసం.

జాతర విశిష్టత

గ్రామశక్తి పోలేరమ్మతల్లి జాతర 1917 నుంచి నిర్వహిస్తున్నారు. వినాయకచవితి అనంతరం వచ్చే తొలి బుధవారంతో జాతర చాటింపు ప్రారంభమై మూడో చాటింపుతో జాతర ముగిస్తుంది. పుట్టినిల్లు అయిన కుమ్మరింట అమ్మవారి ప్రతిమ తయారు చేస్తారు. అమ్మవారికి కళ్లు, దిష్టిచుక్క పెట్టరు. అనంతరం కాంపాళెంలోని గాలిగంగులకు పూజలు నిర్వహించి మెట్టినిల్లు అయిన జీనుగుల వారి వీధికి తీసుకొస్తారు. అక్కడే అత్తింటివారైన రజకులు పోలేరమ్మను స్వీకరిస్తారు. అక్కడ కళ్లు, దిష్టిచుక్క, పూలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. అనంతరం రథంపై ఆశీనులు చేసి అశేషభక్తజన సందోహం మధ్య గుడివద్ద నిలుపుదల చేస్తారు. అప్పటి నుంచి మరుసటిరోజు సాయంత్రం వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. తర్వాత మధ్యాహ్నం దున్నపోతును బలిచ్చి గండదీపంగా పిలవబడే నూనెదీపంతో రజక వ్యక్తిని వీధులన్నిటిలో తిప్పుతారు. బలి ఇచ్చిన దున్నపోతు రక్తంతో తయారు చేసిన అన్నంతో ఊరికి పొలి చుడతారు. ఆ తర్వాత పోలేరమ్మతల్లి ఊరేగింపు (విరూపోత్సవం) ప్రారంభమవుతుంది. ఆ సమయంలో అమ్మవారి మట్టిని తీసుకునేందుకు భక్తులు పోటీ పడుతారు.

> **వెంకటగిరి రాజాల సూచనలతోనే జాతర**
>
> సంప్రదాయబద్ధంగా శతాబ్దాల తరబడి రాజాల ఆధ్వర్యంలో జరుగుతున్న వెంకటగిరి జాతర ఇకపై కూడా వారి సూచనలు, సలహాలతోనే నిర్వహిస్తాం. ఆ రోజుల్లో నుంచే వారి ఆధ్వర్యంలోనే వెంకటగిరి జాతర జరుగుతోంది. జాతర నిర్వాహణకు రాజా కుటుంబీకుల అనుమతి కోరడం, సారె ఇవ్వడం వంటి అన్ని ఆచారాలు యథావిధిగా నడుస్తాయి. జాతరను రాష్ట్ర పండుగగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రటించడం పట్ల ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు.
>
> – నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త
>
> **హర్షణీయం**
>
> 
>
> వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నాం. అయినా పాలకులు ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరిన వెంటనే జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తామని ప్రకటించడం హర్షణీయం.
>
> – బీ.గిరీష్, పోలేరమ్మ భక్తుడు, వెంకటగిరి



ఊరేగింపు



భక్తజనసంద్రంగా వెంకటగిరి(ఫైల్)



పోలేరమ్మ ఆలయం



బలికి దున్నపోతును సిద్ధం చేస్తున్న యువత



వేటకత్తి ఊరేగింపు

వెంకటగిరి చరిత్రలో నిలిచిపోయిన సీఎం సభ



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: పట్టణంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదోవిడత నిధుల విడుదల కార్యక్ర మం సందర్భంగా ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ వెంకటగిరి చరిత్రలో నిలిచిపోయిందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్తూరుపాడు రిజర్వాయర్ పూర్తి చేసేందుకు రూ.550 కోట్లు మంజూరు చేస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వెంకటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్రపండుగగా ప్రకటించడంపై భక్తుల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. నియోజకవర్గంలో నాలుగేళ్లుగా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగకపోవడంతో ప్రత్యేక నిధులుగా రూ.20 కోట్లు, పట్టణంలో డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణానికి జీజీఎంపీ నిర్వహించే సచివాలయాల పరిధిలో రూ.50 లక్షల వంతున మంజూరు చేస్తామని జగనన్న వరాలు ఇవ్వడం ఆనందదాయకమన్నారు. వెంకటగిరి రాజా కుటుంబీకుడు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర సూచనలు, సలహాలతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసిన అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎన్ సురేష్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి సీ.హరికృష్ణ, నేతలు పీ దశరథరామిరెడ్డి, కే.శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

శాఖల సమన్వయంతోనే అభివృద్ధి

- కలెక్టరేట్‌లో గూడూరు నియోజకవర్గంపై రివ్యూ
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించం
- పాల్గొన్న డెప్యూటీ సీఎం, ఎమ్మెల్యే



మాట్లాడుతున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, కలెక్టర్

తిరుపతి అర్బన్: అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని డెప్యూటీ సీఎం కే.నారాయణస్వామి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో గూడూరు నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉపయోగపడే పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందడుగు వేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. జిల్లాలో పలుచోట్ల ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శ్మశాన వాటికలకు స్థలాలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చినా రెవెన్యూ అధికారులు బాధ్యత తీసుకోలేదని ఆరోపించారు. అభివృద్ధికి సంబంధించిన అంశాలు, పథకాల పనితీరుపై ఏవైనా సమస్యలుంటే సంబంధిత ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లితే వారు తప్పకుండా తమవంతు సహకారం అందిస్తారన్నారు. అనంతరం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు మాట్లాడుతూ పాదయాత్రలో జగనన్న పేదల కష్టాలను గుర్తించి ఆ దిశగా పాలన సాగిస్తున్నారని, అందుకు అధికారులు పూర్తి బాధ్యతగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. భూములు లేని ఎస్సీ, ఎస్టీలకు సాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి అర్జీని కలెక్టరేట్‌లో స్పందనకే కాకుండా గ్రామ సచివాలయం, మండలం, నియోజకవర్గ స్థాయిలోనే ఇచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. గడువులోపు గృహనిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గూడూరు నియోజకవర్గంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి 446 వినతులు అందగా అందులో 106 పరిష్కరించినట్లు వెల్లడించారు. జేసీ డీకే బాలాజీ మాట్లాడుతూ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకుని పనిచేయాలన్నారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎఫ్‌ఓ సతీష్‌రెడ్డి, సీపీఓ ప్రేమ్ చంద్ర, గృహనిర్మాణ సంస్థ పీడీ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈ శంకర్ నారాయణ, గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

ఆస్తి రాసివ్వలేదని కన్నపేగుపై పగ!

జీవితం చాలా విచిత్రమైనది. వయస్సులో భార్య, పిల్లల పోషణకే సరిపోతుంది. ముదసలి వచ్చేసరికి బిడ్డలపై ఆప్యాయత పెరుగుతుంది. వారిపైనే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. కడుపున పుట్టిన నలుసు సక్రమంగా నడుచుకుంటే పర్లేదు. లేకుంటే నరకం అనుభవించాల్సి వస్తుంది. ఇలాంటిదే చంద్రగిరి నియోజకవర్గంలో వెలుగు చూసింది. తల్లిదండ్రులను సక్రమంగా చూసుకోని ఓ కొడుకు తమపేరుపై ఉన్న 75 సెంట్ల భూమిని తన పేరున రాసివ్వలేదని కక్ష పెంచుకున్నాడు. భార్యతో కలిసి కన్నతల్లిదండ్రులను రాసిరంపాన పెట్టడం మొదలుపెట్టాడు. ఇంటి నుంచి వెళ్లగొట్టి నరకం చూపిస్తున్నాడు. పాడుబడిన ఇంట్లో తలదాచుకుంటున్నా.. ఆ ఇంటికీ కరెంట్ లేకుండా చేసి వేడుక చూస్తున్నాడు. నిత్యం వేధింపులు భరించలేక మనసు చంపుకుని ఆ వృద్ధ తల్లిదండ్రులు కన్నకొడుకుపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కినా ఫలితం లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అసలు ఎందుకు..ఏంటో మీరే చదవండి..

- భార్యతో కలిసి చిత్రహింసలు
- కొడుకుపై పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు



చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేసిన రఘునాథ్, తులసి దంపతులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఆస్తికోసం కన్న తల్లిదండ్రులను కొట్టి బయటకు గెంటేశాడు ఓ ప్రబుద్ధుడు. తాను ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులను బయటకు నెట్టేసి 15 రోజులు కావస్తున్నా కనికరించలేదు ఆ కసాయి కొడుకు. స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం లేదని ఆ వృద్ధ దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురానికి చెందిన తులసి, రఘునాథ్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. అష్టకష్టాలు పడి ఇద్దర్నీ చదివించి పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు చేశారు. కుమారుడు బాలాజీ వకుళమాత ఆలయం వద్ద హోంగార్డుగా పనిచేస్తున్నాడు. రఘునాథ్‌కు శ్రీనివాసమంగాపురం సమీపంలో 75 సెంట్ల భూమి, రెండు ప్లాట్లు ఉన్నాయి. ఈ ఆస్తి తనపేర రాసి ఇవ్వాలని కుమారుడు బాలాజీ నిత్యం తల్లిదండ్రులను వేధించేవాడు. ఆస్తి కోసం ఏడు నెలల క్రితం తల్లిదండ్రులను తీవ్రంగా కొట్టి ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. మరళా పెద్దలు సర్ది చెప్పడంతో వారిని ఇంట్లోకి చేర్చుకున్నాడు.

ఆకలి కేకలు!

కోడలు కూర్చొని ఉంటే వృద్ధులైన అత్తామామలు ఇంటి పని, వంటపని చేయాలి. లేదంటే పిడికెడు మెతుకులు రాలవు. కాలుచెయ్యి ఆడేటప్పుడే ఇలా ఉంటే మంచాన పడితే ఎలా అని రఘునాథ్ భార్య తులసి బోరున విలపిస్తోంది. ఆస్తి మొత్తం రాసివ్వాలని, లేదంటే ‘చచ్చిపోండి’ అంటూ కుమారుడు బాలాజీ వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ రాసుకోనీయకుండా ఆధార్ కార్డు కూడా పెరికిపెట్టుకున్నాడని వాపోయారు. ప్రాధేయపడినా కొడుకు కనికరించడంలేదని, నాకు ఆస్తి రాసి ఇచ్చే వరకు ఏమీ ఇవ్వనని మరొకసారి కొట్టి తరిమేశాడని కన్నీటిపర్యంతమయ్యారు.

వేధింపులు తీవ్రతరం

కొడుకు బాలాజీ కొట్టితరిమేయడంతో గ్రామంలోనే ఓ పాడుబడిన ఇంట్లో 15 రోజులుగా తలదాచుకుంటున్నామని రఘునాథ్ తెలిపారు. అయినా అక్కడ కూడా ఉండకుండా చేయాలని ఆ ఇంటికి కరెంట్ కూడా కట్ చేశాడని ఆరోపించారు. ప్రస్తుత అప్పు చేసి పిడికెడు మెతుకులు తింటున్నామని తెలిపారు. కరెంటు లేని ఇంట్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని వాపోయారు. 15 రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదని ఆరోపించారు. ఆస్తి కోసం వేధిస్తున్న కొడుకు నుంచి తమకు రక్షణ కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోతే తమకు చావే శరణ్యమని కన్నీళ్లు పెట్టుకున్నారు.

సంక్షేమ స్వర్ణయుగం



పాకాలలో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- జగనన్న పాలనలో ప్రతి ఇంట్లో సంతోషం
- వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- జగనన్న సురక్షలో 5,825 సర్టిఫికెట్ల పంపిణీ

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను సంక్షేమ స్వర్ణయుగంగా దేశవ్యాప్తంగా కీర్తిస్తున్నారని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. జగనన్న సురక్ష కార్యక్రమాల్లో భాగంగా శనివారం తిరుపతి రూరల్, రామచంద్రాపురం, చంద్రగిరి, పాకాల మండలాల్లో సభలు నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పలు ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లిలో 874, సాయినగర్–2లో 862, రామచంద్రాపురం మండలం సి.కాలేపల్లిలో 903, చంద్రగిరి మండలం రాయలపురంలో 702, కందులవారి పల్లిలో 573, పాకాల మండలం పెద్దగోరుపాడులో 268, పాకాల–2లో 1,643 ఇలా శనివారం ఒక్కరోజే 5,825 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఆయా పంచాయతీలలో చేసిన అభివృద్ధిని విశదీకరించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్న పాలన స్వర్ణ యుగాన్ని తలపిస్తోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు పక్కాగా అందుతున్నాయని వివరించారు. ప్రభు త్వం అందించే వివిధ రకాల సేవలు, సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. అవసరమైన సర్టిఫికెట్లను ఇళ్ల ముంగిటకే పంపిణీ చేయాలనే సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు.